# రాజారావు

రాజారావు భార్య చిన్నతనంలో ఎప్పుడో పోయింది. మళ్లీ వివాహం కాలేదు. ఇంకేం అవుతుంది! నలభై ఏండ్లు వచ్చినవి!

అతడు ఎల్లాగ బ్రతుకుతున్నాడో ఎవరికీ తెలియదు. ఉద్యోగం సద్యోగం లేదు. ఇల్లూ వాకిలీ లేదు. నా అన్నవారు లేరు. ఎక్కడో తినేవాడు. ఒక స్నేహితుని ఇంట్లో మటుకు అతనికో గది యిచ్చారు ఉంటానికి.

ఎప్పుడన్నా పత్రికలకు ఒక కథో వ్యాసమో వ్రాస్తాడు. దానివల్ల ఓ అయిదు రూపాయలు వస్తవి. ఆ అయిదు వచ్చిన రోజు సాయంత్రానికి కనపడవు. రేపు అనే రోజు ఎట్లాగ గడుస్తుంది అని అతను ఎప్పుడు ప్రశ్నించుకోలేదు.

ఒక పద్యమైనా వ్రాయలేదు అతడు. అయినా అతనిని అంతా కవి అని పిలుస్తారు. ఎవరైనా కాఫీ హొటలుకు రమ్మంటే వెడతాడు. సిగిరెట్టు ఇస్తే తాగుతాడు. అంతేకాని నాకు ఇది కావాలె ఇప్పించమని అతడెవ్వరినీ అడగలేదు.

అతడు ఎప్పుడు కులాసాగా ఉంటాడు. చిరునవ్వు అతని పెదవులపైన ఎప్పుడూ నృత్యం చేస్తూ ఉంటుంది. అతడు అంత దారిద్ర్యం అనుభవిస్తూ కూడా సంతోషంగా ఉంటాడు. నవ్వుకుంటూ బ్రతుకుతాడు.

అన్నంతిన్న రోజునా నవ్వుతూ ఉంటాడు. తినని రోజునా నవ్వుతూనే ఉంటాడు.

మనిషైన వాడికి ఎన్నో విచారాలు ఉంటవి. బట్టలు లేవనీ, తిండి లేదనీ, ఉంటానికి ఇల్లు లేదనీ! ఇవన్నీ ఉంటే భార్యా పిల్లలు లేరని! వాళ్లు వుంటే ఉన్నారనీ, ఇల్లాగ మానవుణ్ణి ఆశ్రయించుకొని ఎన్నో పిల్లదుఃఖాలు పెద్ద దుఃఖాలు బ్రతుకుతున్నవి. ఈ మనిషికి ఏ దుఃఖమూ లేదు, విసుగు లేదు, చిరాకు లేదు. ఒక్క చిరునవ్వు అనే ఖడ్గంతో, ఏ దుఃఖమూ తన దగ్గరకు రాకుండా కాపాడుకొంటున్నాడు.

జీవితాన్ని ఇంత ధైర్యంగా ఎదుర్కొనగలిగిన ఈ వ్యక్తి, పెండ్లి చేసుకొంటే?

భార్యా, పిల్లలు, సంసారం ఏర్పడ్డ తరువాత ఈతని జీవితం ఇల్లాగ వెన్నెల రాత్రిలాగ ఉంటుందా, అప్పుడు తెలిసి వస్తుంది జీవితం అంటే ఏమిటో, ఇప్పుడు

ఒంటరిగాడు కాబట్టి ఏదో నెట్టుకొస్తున్నాడు. ఇల్లాగ అనుకొన్నాము మేమంతాను.

ఈ మధ్య రాజారావు రెండు సంవత్సరాల పాటు కనపడలేదు. ఎక్కడికి వెళ్ళింది ఎవ్వరికీ తెలియదు. యుద్ధంలోకి వెళ్ళాడనీ, బహుశః వెళ్ళిపోయి ఉంటాడనీ అంతా అనుకొన్నారు.

ఉన్నట్లే ఉండి ఒకరోజు హఠాత్తుగా ఊడిపడ్డాడు. బజార్లో దువ్వెనలూ, సబ్బులూ, వాసన నూనెలూ అల్లాంటి వస్తువులు అమ్మే షాపులో ఏవో కొంటూ ఉన్నాడు.

ఆ ముఖం ఎప్పటిలాగ కళకళలాడుతూ ఉంది. మళ్లీ నవ్వుతూ పలకరించాడు.

అతని ప్రక్కన ఓ ముసలమ్మ ఉంది!

రాజారావుకు తల్లిగాని, పెద్ద అక్కగారు గాని లేరు. ఆ విషయం మా కందరికీ తెలుసు.

ఆ ముసలమ్మ ప్రక్కన నుంచుని ఆవిడగారికి వాసన నూనెలూ, సెంటు బుడ్లు అవీ కొనిపెడుతున్నాడు. ఆ ముసలమ్మ ఎవరు అయి ఉంటుంది. మేమంతా ఆశ్చర్యపోయినాము.

'మీ పిన్నా?' అని అడిగాము. వాడు తల త్రిప్పి కాదని సూచించాడు.

'మీ అక్కగారా?

మళ్ళీ తల తిప్పాడు.

ఆమె వీడికి బంధువు కాదన్నమాట!

అయితే ఎవరైనట్లు?

ఆమె వీడికి బంధువు కాదుగదా అన్న ధైర్యంతో 'ఎవర్రా ఈ ముసలిది?' అన్నాము.

వాడు అన్నాడు – మీరు నన్ను క్షమించాలె. నేనుమీకు చెప్పలేదు. నేను వివాహం చేసుకొన్నాను.

'అయితే అత్తగారా బాబూ?' అన్నాము.

'కాదు నా భార్య' అన్నాడు రాజారావు.

మాకు నిలువు గుడ్లు పడిపోయినయి. భార్య! ఇదేం భార్య! వీడు నలభై ఏండ్లలోపు - ఆమెకు అరవై ఏండ్లు పైన! ఇదేం దాంపత్యంరా రామచంద్రా! అని మేము ఆశ్చర్యపడి నిశ్చేష్టులమై పోయినాము.

వాడు అన్నాడు 'ఏ భవనములో కురుంగనయన అయిన గృహిణి కనబడదో ఆ భవనము సకల సంపత్తులతో కూడుకొన్నప్పటికీ వనమే అవుతున్నది కాని భవనము కావటము లేదు. గృహానికి గృహలక్ష్మి ఉండాలె.'

నిజమే అనుకో, ఇదెక్కడి కురంగనయనరా నిన్ను తగలెయ్య!

ఆమెగారి రూపం చూస్తే ఎవరకైనా ఆశ్చర్యం కలుగుతుంది.

తల నెఱిసి ఏకులబుట్ట అయింది!

మెడక్రింద చర్మం ముడుతలు పడ్డది!

చేతుల కాళ్లూ ఎండిన కాష్ఠాకృతి!

సొట్ట బుగ్గలు!

పీక్కుపోయిన కళ్ళు!

ఒంటిమీద ఒక నగ అయినా లేదు!

దేనికి ఆశపడి చేసుకొన్నట్లు!

వాడిని కొంచెం ఇవతలకు పిలిచి ఏమైనా మనస్సులో కష్టపడతాడేమోనన్న ఆలోచన అయినా లేకుండా అన్నాము 'ఏమోయ్ ఎక్కడ సంపాదించావు ఈ ముసలి తొక్కను!!'

ఈ మాటమీద వాడికి కోపం వస్తుందని భయం వేసింది.

రాజారావుకు కోపం రాలేదు.

నవ్వాడు.

ఇంకా ఏదో మాట్లాడాలనుకొన్నాము ఆమెను గురించి, వీడైతే నవ్వి ఊరుకొన్నాడు. ఆవిడ వింటే పోట్లాటకు ందూ! అందుకని వాడికి మాత్రము వినపడేటంతటి తగ్గు గొంతుకతో ఏదో అనబోతుంటే వాడు మా మాటకు అడ్డొచ్చి

అన్నాడు 'ఫరవాలేదు పెద్దగా మాట్లాడు. ఆమెగారికి పుట్టెడంత చెవుడు! అరిచి చచ్చినా వినపడదు!'

ఈ ఆకారానికి తోడు అది కూడానా! అని నవ్వాము.

వాడు సంతోషంతో 'కళ్లు కూడా సరిగ్గా కనపడవు!' అని ఇంకొక విషయాన్ని కూడా బైటపెట్టాడు.

మేము ఆశ్చర్యపడి నుంచుంటే వాడు సంతోషంతో తూగుతూ 'పళ్లు లేవు! అవి కట్టుడు పళ్ళు' అని పకపకా నవ్వాడు.

అంతటితో ఆ సుందరి సౌందర్యవర్ణన పూర్తి అయింది.

వాడికి విచారం లేదు. పైగా ఎంతో సంతోషిస్తున్నాడు.

మమ్మలను తీసుకెళ్ళి, ఆమెకు ఎదురుగా నుంచోబెట్టి – వీరు మా స్నేహితులు అని పెద్దగా అరిచి చెప్పాడు.

ఆవిడ సంతోషించింది.

వాడు మాతో ఇల్లా అన్నాడు. 'ఇప్పుడు జీవితం, సుఖంగా ఉందోయ్... ఇన్నాళ్ళకు ప్రేమ అంటే ఏమిటో తెలిసింది'.

ఆ తరువాత రాజారావు, ప్రేమగా భార్య చెయ్యిపట్టుకొని బండిదగ్గరకు నడిపించుకు పోయినాడు.

*('ఆనందవాణి' వారపత్రిక, ఫిబ్రవరి 22, 1948)*